సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



భగవద్గీతపై ప్రచారం

ధర్మారం: గోపాల్‌రావుపేటలో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక, కొడిమ్యాల కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు.



భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను సోమవారం సుమారు 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో భక్తులు అంతంతే వచ్చారు.

గరిష్టం/కనిష్టం
41.0/27.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాలుగోరోజు.. 14 మంది నామినేషన్

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి నాలుగో రోజు సోమవారం 14మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వారు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మంద రమేశ్, స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గం సమ్మయ్య,, అర్నకొండ రాజు, గడ్డం మారుతి, రాముల కార్తీక్, జుమ్మిడి గోపాల్, అంబాల మహేందర్, జనగామ నరేశ్, ముల్కల్ల రాజేంద్రప్రసాద్, దాగం సుధారాణి, జాడి ప్రేమ్‌సాగర్, అక్కపాక తిరుపతి ఒక్కోసెట్ నామినేషన్ పత్రం దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు గద్దల వినయ్‌కుమార్, బొట్ల చంద్రయ్య రెండేసి సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇప్పటివరకు నాలుగు రోజుల్లో 25 మంది అభ్యర్థులు మొత్తంగా 31 సెట్ల నామినేషన్ పత్రాలు అధికారులకు అందజేశారు. ఈనెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

అవార్డులు అందుకున్న '108' సిబ్బంది



అవార్డు అందుకుంటున్న వంశీధర్‌రెడ్డి, హబీబ్

మంథని: పట్టణానికి చెందిన 108 వాహన సిబ్బంది రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని 108 ఎమర్జెన్సీ సర్వీసెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి 108 వాహన ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా మంథని 108 వాహన టెక్నీషియన్ వంశీధర్‌రెడ్డి, పైలట్ హబీబ్.. జీవీకే ఈఎంఆర్‌ఐ తెలంగాణ హెడ్ ఖలీద్, డైరెక్టర్ వెంకటేశం చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అంబులెన్స్ సేవల్లో ప్రతిభ చూపినందుకు అవార్డులు అందించినట్లు తెలిపారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



అధికారులను చుట్టుముట్టిన మహిళలు

ముత్తారం(మంథని): వారం రోజులుగా తాగునీరు అందడం లేదనే ఆగ్రహంతో ఖమ్మంపల్లి ఎస్సీ, బీసీకాలనీ మహిళలు ఖాళీ బిందెలు పట్టుకుని సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులను చుట్టుముట్టి నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో తాగునీటి సమస్య తలెత్తిందని ఆరోపించారు. సమస్య పరిష్కారం కోసం వచ్చిన ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, ఏఈ ప్రణవ్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మానేరులోని విద్యుత్ మోటార్లు కాలిపోయాయని, మరమ్మతు పూర్తిచేసినా బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ తెలిపారు. ఏదేమైనా మానేరు నుంచి కొత్త పైప్‌లైన్ నిర్మించి తమకు తాగునీరు అందించాలని మహిళలు డిమాండ్ చేశారు. ఎంపీడీవో లలిత మాట్లాడుతూ, ప్రత్యేకాధికారులు రాగానే సమస్య పరిష్కరిస్తామనడంతో మహిళలు శాంతించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కిందని మాజీ మంత్రి, ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రావాలనే ఆలోచనతో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారని ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. రైతుబంధు, రైతురుణమాఫీ పథకాలను అమలు చేయడం లేదని కొప్పుల విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి బీఆర్‌ఎస్‌కే అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, నాయకులు గంట రాములు, దాసరి ఉష పాల్గొన్నారు.

క్యాడర్‌పైనే నేతల ఫోకస్

- మండలాల వారీగా సమావేశాలు
- అసంతృప్తులకు గాలం వేసేందుకు కాంగ్రెస్ నేతల వ్యూహాలు
- సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్, బీజేపీల విశ్వ ప్రయత్నాలు



సాక్షి, పెద్దపల్లి: నామినేషన్ల దాఖలుకు గడువు చివరి దశకు చేరుకుంటోంది. ఈనేపథ్యంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. గతానికి భిన్నంగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో త్రిముఖపోరు నెలకొని ఉంది. దీంతో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థి ప్రతీ ఓటరు, గ్రామాన్ని టచ్ చేయడం కష్టంతో కూడున్నది కావడంతో క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే తమ పార్టీలోని అసంతృప్తి క్యాడర్ పక్క పార్టీ వైపు చూడకుండా కట్టడి చేసేందుకు అనేకపాట్లు పడుతున్నారు. నియోజకవర్గాల వారీగా మండలాలు, మున్సిపాలిటీల వారీగా బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల గురించి వివరిస్తున్నారు. దీంతోపాటు తమ పార్టీ చేసిన అభివృద్ధి, అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి పనులను ఓటర్లుకు వివరించాలని ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం చేస్తున్నారు.

చేరికలపై కాంగ్రెస్ ఫోకస్..

- అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో క్లీన్‌స్వీప్ చేసిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీ జెండా ఎగురవేసి సత్తా చాటాలని చూస్తోంది.
- అందుకోసమే క్షేత్రస్థాయి బాటపట్టింది. ఇందుకోసం మండలాల వారీగా, నియోజకవర్గాల వారీగా క్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తోంది.
- ఇదే సమయంలో బీఆర్‌ఎస్ పార్టీలోని అసంతృప్తి నేతలు, క్యాడర్‌ను నియోజకవర్గాల ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటోంది.
- అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ మారిన వారిని మళ్లీ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించేందుకు హస్తం నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.
- ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లేలా కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

సామాజికవర్గాల మద్దతుతో ముందుకు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

- బూత్‌లు, శక్తి కేంద్రాలను బలోపేతతం చేసే పనిని ఇప్పటికే పూర్తిచేసిన బీజేపీ.. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి పనులను క్యాడర్ ద్వారా ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా కార్యాచరణ అమలు చేస్తోంది.
- పదేళ్లుగా కేంద్రంలో ప్రధాని మోదీ అందిస్తున్న అవినీతి రహిత పాలన, అవినీతిని అంతం చేసేందుకు చేపడుతున్న చర్యలను వివరిస్తూ కమలం పార్టీ ప్రజల్లోకి వెళ్తోంది.
- అలాగే అయోధ్య రామమందిర నిర్మాణం, మోదీ ఇమేజ్‌తోపాటు పెద్దపల్లి నియోజకవర్గంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గం మద్దతు కూడగట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.
- ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ, నేతకాని నేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. త్వరలో ఇలాంటి కార్యక్రమాలను నియోజకవర్గాల వారీగా నిర్వహించి పెద్దపల్లి పార్లమెంట్‌లో బోణీ చేయాలని కమలం కసరత్తు ప్రారంభించింది.

3న కేసీఆర్ బస్సుయాత్ర

పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో రెండుసార్లు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. హ్యాట్రిక్ విజయంతో అసెంబ్లీ ఎన్నికల ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని ఆ పార్టీ నేతలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎండిన పంటలపై నిరసన దీక్షలు, రైతు సమస్యలతో ప్రచారం చేస్తున్నారు. అయితే, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు కారును వీడి కాంగ్రెస్ గూటికి చేరుతుండటంతో క్యాడర్‌ను పార్టీ వీడి వెళ్లకుండా ఏర్పాట్లు చేస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారాన్ని మరింత ఉరుకలెత్తించేందుకు వచ్చేనెల మూడో తేదీన బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీసీఎం కేసీఆర్ రామగుండం పర్యటనకు రానున్నారు.

జైబోలో హనుమాన్‌కీ..



మాల విరమణ మండపం వద్ద స్వాములు

కొండగట్టు(చొప్పదండి): 'రామలక్ష్మణ జానకీ.. జైబోలో హనుమాన్‌కీ..' అంటూ కొండగట్టులోని అంజన్న ఆలయం పులకించిపోయింది. చైత్ర పౌర్ణమి సందర్భంగా హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభించారు. హనుమాన్ దీక్షాపరులు మాల విరమణకు వేల సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం స్వామివారి జయంతి కావడంతో సుమారు 1.50లక్షల మంది భక్తులు వస్తారని ఆలయ అధికారులు తెలిపారు. వారికి సరిపడా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఈవో చంద్రశేఖర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు భక్తుల ఏర్పాట్లలో మునిగిపోయారు. కొండపైకి వచ్చిన భక్తులు ముందుగా క్యూలైన్ ద్వారా స్వామి వారిని దర్శించుకోవాలని, ఇరుముడులను ఆలయంలో ఏర్పాటు చేసిన జాలీల్లో సమర్పించాలని, పాత కోనేరు ఎదురుగా ఉన్న మెట్ల నుంచి కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన లైన్ల ద్వారా మండపంలోకి వెళ్లి మాల విరమణ చేసుకోవాలని, శ్రీరామకోటి స్తూపం వద్దగల షెడ్డులో తలనీలాలు సమర్పించాలని, కోనేరులో పుణ్యస్నానం ఆచరించి.. చివరగా ప్రసాదం తీసుకుని తిరుగు ప్రయాణం కావాలని ఆలయ అధికారులు తెలిపారు.



దీక్ష విరమణ చేస్తున్న స్వాములు



ఇరుముడులు కడుతున్న స్వాములు

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

- వెనువెంటనే చెల్లింపులు చేయాలి
- అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: రైతులు మద్దతు ధర కోసం విక్రయిస్తున్న ధాన్యానికి సకాలంలో చెల్లింపులు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లను సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్ రెడ్డితో కలిసి ఆయన సోమవారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా రైతులకు అవసరమైన టార్పాలిన్లను సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా సరిపడా లారీలను సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. అన్నదాతలు కూడా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి కొనుగోళ్లు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల సురేందర్, అధికారులు పాల్గొన్నారు.



కొనుగోళ్లను తనిఖీ చేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

నాణ్యమైన ధాన్యం తేవాలి..

సుల్తానాబాద్(పెద్దపల్లి): రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లా ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను ఆయన తనిఖీ చేశారు. రైతులు నాణ్యమైన ధాన్యం తేవాలని, చివరిగింజ వరకూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. మిల్లులకు ధాన్యం తరలించేందుకు వాహనాలు సమకూర్చుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మిల్లర్లు కోత లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బట్టతో తయారు చేసిన సంచులు పంపిణీ చేస్తున్న ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ తదితరులు

- ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జీఎం కార్యాలయంలో జీఎం కార్యాలయ సిబ్బంది, సివిల్ కాంట్రాక్టు ఉద్యోగులకు సోమవారం గుడ్డసంచులు అందజేశారు. పంచభూతాలను కలుషితంగా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి వేల సంఖ్యలో మొక్కలు నాటి పెంచే బాధ్యత తీసుకుంటోందని తెలిపారు. జూన్ – 5 వరకు సింగరేణిలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ ఏజీఎం సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్విరాన్మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఏరియా సేఫ్టీ అధికారి భైద్య, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మీబాయి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేస్‌వర్క్‌షాప్‌లో సదస్సు

పర్యావరణ పరిరక్షణపై ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ అధికారి కోటయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని సూచించారు. మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం ఉద్యోగులు రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి కిషన్, యూనియన్ నాయకులు జక్కుల దామోదర్‌రావు, నక్క రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగులతో ప్రతిజ్ఞ..

రామగిరి(రామగుండం): పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. తన కార్యాలయంలో మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, పర్యావరణ, ఫారెస్ట్, ఐఈడీ డీజీఎంలు రాజారెడ్డి, కర్ణ, చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టువదలని విక్రమార్కుడు!



నామినేషన్ దాఖలు చేస్తున్న వినయ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన గద్దల వినయ్ కుమార్ 1991 నుంచి పెద్దపల్లి (ఎస్సీ రిజర్వుడ్) పార్లమెంట్ స్థానం నుంచి వరుసగా పోటీ చేస్తున్నారు. 1996 ఎన్నికల్లో పోటీ చేసిన వినయ్‌కుమార్.. ఎన్నికల వ్యయం అందించని కారణంగా పోటీకి అనర్హుడయ్యారు. ఆ తర్వాత ప్రతీ ఎన్నికలో వరుసగా పోటీ పడుతూ వస్తున్నాడు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ టికెట్ సాధించినా.. సకాలంలో దాఖలు చేయని కారణంగా స్వతంత్ర అభ్యర్థిగానే పోటీపడ్డారు. ఈసారి ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థిగానే సోమవారం మరోసారి నామినేషన్ దాఖలు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన పెద్దపల్లిలో అందరూ గద్దల వినయ్‌కుమార్‌ను 'ఎంపీ సాబ్' అంటూ సరదాగా పిలుస్తుంటారు.

'రుణమాఫీపై కుంటిసాకులు'



మాట్లాడుతున్న దాసరి ఉష

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం కుంటిసాకులు చెబుతూ, రైతులను దగా చేస్తోందని బీఆర్‌ఎస్ నేత దాసరి ఉష ధ్వమెత్తారు. స్థానిక ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఇప్పలపల్లె హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకకు హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీపై తొలిసంతకం చేస్తామని ప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజులు దాటినా దానిని అమలు చేయడం లేదన్నారు. రైతు రుణమాఫీ, రూ.500 బోనస్ చెల్లింపు, ఆరు గ్యారంటీలు అమలు చేసేదాకా బీఆర్‌ఎస్ నేతృత్వంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు. నాయకులు మాదాసు సువర్ణ, సారంగపాణి, చందు ఉన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం



టీచర్స్ కాలనీ పార్కులో నీళ్లు చల్లుతున్న సిబ్బంది

- 'సాక్షి'కి నగర ప్రజల అభినందనలు
- పార్కుల పరిశుభ్రతపై బల్దియా కమిషనర్ శ్రీకాంత్ నజర్

సాక్షి ఎఫెక్ట్..

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం బల్దియాలోని పార్కుల దుస్థితిపై ఈనెల 20న 'సాక్షి' ప్రచురించిన 'ఎండిన మొక్కలు.. విరిగిన పరికరాలు' కథనంపై అధికారుల్లో కదలిక వచ్చింది. నగరంలో ప్రజలు ఆహ్లాదం పొందడానికి సరిపడా పార్కులు లేకపోవడం, ఉన్నవి అనవాళ్లు కోల్పోతుండాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చి పాలకులు, అధికారులను ఆలోచింపజేసింది. దీంతో పార్కుల శుభ్రతపై నగరపాలక కమిషనర్ శ్రీకాంత్ సీరియస్‌గా నజర్ పెట్టారు. సోమవారం స్థానిక టీచర్స్‌కాలనీ మున్సిపల్ పార్కును పరిశీలించారు. ఆయన ఆదేశాలతో పారిశుధ్య సిబ్బంది పార్కులోని చెత్త తొలగించారు. చెట్లు, మొక్కలకు నీళ్లు పోశారు. ఉద్యాన వనాలపై నిత్యం అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఇప్పటివరకు పార్కులపై కనెత్తిచూడని అధికారులు.. 'సాక్షి' కథనంతో వాటి అభివృద్ధికి పరుగులు పెడుతుండడంపై నగర ప్రజలు అభినందిస్తున్నారు.

కార్మిక, పెట్టుబడిదారి వర్గాలకు పోటీ

- ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తామన్న ప్రధాని మోదీ
- అందుకే ఈఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికే మద్దతు
- పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడ్ స్థానం 'కాకా' కుటుంబానిదేనా..!
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి కార్మికుడి బిడ్డగా పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు అండగా నిలిచి, పెట్టుబడిదారుడైన కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ తనయుడు వంశీకృష్ణను ఓడించేందుకు మాదిగ, నేతకానీలు ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కోరారు. పెద్దపల్లిలో సోమవారం పార్లమెంట్‌స్థాయి మాదిగ, నేతకాని సంఘం నేతలతో ఆయన సమావేశమయ్యారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, బీజేపీ నాయకుడు పర్వతాలు తదితర నేతలతో కలిసి మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ (ఎస్సీ రిజర్వుడు) స్థానం నుంచి అపరకుబేరుడైన వెంకటస్వామి, ఆయన తనయుడు వివేక్ ప్రాతినిధ్యం వహించగా ఈసారి ఎన్నికల్లో వెంకటస్వామి మనుమడు వంశీకృష్ణను కాంగ్రెస్ అధిష్టానం పోటీకి నిలుపుతోందని తెలిపారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్న ఆస్తులను కాపాడుకునేందుకు పదవులు దక్కించుకుంటున్నవారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. పెద్దపల్లిలో బీజేపీ అభ్యర్థిని మార్చుతారంటూ జరుగుతున్న ప్రచారం ఉత్తదేనని స్పష్టం చేశారు. 'బీజేపీ అభ్యర్థిగా గోమాస శ్రీనివాస్ పేరును ప్రకటించేలా చేశా.. నామినేషన్ వేసే సమయానికల్లా బీఫారమ్ తెచ్చి చేతిలో పెడతా' అని అభయమిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ 30 ఏళ్లుగా సాగుతున్న ఎస్సీ వర్గీకరణకు సహకరించి పోరాటానికి ముగింపు పలుకుతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్సీల్లో జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలంటే వర్గీకరణ జరగాల్సిందేనన్నారు. అందుకే ఈసారి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాయకులు రాజేందర్, కన్నం అంజయ్య, శంకర్, పల్లె సదానందం, హేమాజీ, శరత్, సమ్మయ్య, బాపు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న విజయరమణారావు, వంశీకృష్ణ

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జరిగింది. తొలుత వంశీకృష్ణ మాట్లాడుతూ తన తాత వెంకటస్వామి(కాకా) తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 నుంచి పోరాటం చేశారన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తు చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే వంశీకృష్ణను ఎంపీగా గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంతో శ్రమించాలన్నారు. నాయకులు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, మస్రత్, దామోదర్‌రావు, న్యాతరి శ్యాం, కల్వల శ్రీనివాస్, అశోక్‌గౌడ్, సాయిరి మహేందర్, వెంకటేశ్వర్‌రావు, సింధూజ, కావేరి పాల్గొన్నారు.

రాముడి పేరిట బీజేపీ రాజకీయం

జూలపల్లి(పెద్దపల్లి): రాముని పేరిట బీజేపీ రాజకీయం చేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు విమర్శించారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. వంశీకృష్ణను ఎంపీగా గెలిపించాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించేందుకు తనను గెలిపించాలని వంశీకృష్ణ విన్నవించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బొద్దుల లక్ష్మణ్, ప్రకాశ్‌రావు, బండారి రాంమూర్తి, నాయకులు వేణుగోపాలరావు, అన్నయ్యగౌడ్, జలపతిరెడ్డి, గండు సంజీవ్, దండె వెంకటేశం, నర్సింహయాదవ్, మొగురం గట్టయ్య, బొజ్జ శ్రీనివాస్, పాటకుల నర్సయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న జడ్జి శ్రీనివాస్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): విద్యార్థి దశనుంచే క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, పెద్దలతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో న్యాయవాదులు భూమయ్య, శ్రీనివాస్, రామమూర్తి, పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణ్ కుమార్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఈనెల 24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి కొమ్ము గట్టయ్య తెలిపారు. అండర్ -14, 16, 18, 20లో బాల, బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గలవారు వయస్సు నిర్ధారణ పత్రం, ఆధార్‌కార్డుతో ఈనెల 24న ఉదయం 7గంటలకు జూనియర్ కాలేజీ మైదానంలో హాజరై తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతిభ కనబర్చిన 25మంది అథ్లెట్లను సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వివరించారు. పూర్తివివరాలకు 94404 24640 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: చల్‌గల్ గ్రామానికి చెందిన కోట శ్రీనయ్య(26) అంబారిపేటలో గేదెల కాపరిగా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం రజితతో వివాహమైంది. కాగా, కొంతకాలంగా శ్రీనయ్యకు మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ క్రమంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం సాయంత్రం అంబారిపేటలోనే చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రూ.15 లక్షలు పట్టివేత

జమ్మికుంట(హుజూరాబాద్): వాహన తనిఖీల్లో సోమవారం భారీగా నగదు పట్టుకున్నట్లు ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. జమ్మికుంట మున్సిపల్‌లోని గ్రేన్ మార్కెట్ ఏరియా రోడ్డులో టౌన్ సీఐ రవి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మోత్కుల గూడెంకు చెందిన పానగంటి సురేశ్ తన బైక్‌లో రూ.15 లక్షలు తరలిస్తూ పట్టుబడ్డాడు. ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి, జిల్లా ఎన్నికలు, ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బండలింగంపల్లికి చెందిన బండారి సుజాత(27) ఆదివారం అదృశ్యమైంది. సుజాత తండ్రి బాబు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సుజాత కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి ఇంట్లోనే నిద్రపోయింది. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టు పక్కల ఇళ్ల, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఉరడి సునిల్ కుమార్, తండ్రి: ఉరడి లక్ష్మయ్య, నివాసము: బొంపల్లి గారు తన యొక్క కూతురు పేరును ఉరడి సన్విహ తండ్రి సునిల్ కుమార్ నుండి ఉరడి అమైర తండ్రి సునిల్ కుమార్‌గా మార్చుకొనుటకు దరఖాస్తు సమర్పించినారు. కావున ఇట్టి విషయములో ఎవరికైనా అభ్యంతరము ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (7) రోజులలోపు ఈ దిగువ సంతకము చేసిన అధికారి ఎదుట సంబంధిత ఆధార పత్రములతో హాజరు కాగలరు. లేనిచో ఇట్టి విషయములో నిబంధనల ప్రకారం తదుపరి చర్య తీసుకోవడం జరుగుతుంది.

సం/-, తహశీల్దార్, పెద్దపల్లి

రెబల్ రెడ్డీ!

- 25న నామినేషన్ వేసేందుకు సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే
- అలిగిన ప్రవీణ్‌రెడ్డికి అధిష్టానం పిలుపు
- త్యాగానికి విలువలేకుండా పోయిందని ఆవేదన
- కాంగ్రెస్ బలగంతో వెలిచాల నామినేషన్
- పోటాపోటీ నామినేషన్లతో పార్టీలో పెరగనున్న వేడి

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా వీడలేదు. పార్టీ సూచనల మేరకు సోమవారం ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ వేయగా, తనకు రావాల్సిన టికెట్ మరొకరికి ఎలా ఇస్తారంటూ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కూడా నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో హస్తం పార్టీలో పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారన్న సమాచారం ఒక్కసారిగా వేడి పెంచింది. పార్టీ ఇంతవరకూ ఎవరికీ బీఫారం ఇవ్వకపోవడంతో ప్రవీణ్‌రెడ్డి వర్గంలో ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. తమ నేతకు టికెట్ ఇప్పించేందుకు చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేస్తున్నారు. అవసరమైతే రెబల్‌గా బరిలో దిగాలన్న యోచనలో ప్రవీణ్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది.

సోమవారం హడావుడి

సోమవారం కరీంనగర్‌లో పలు ఆసక్తికర పరిణామాలు జరిగాయి. ఇప్పటికే తానే అభ్యర్థినంటూ ప్రచారం మొదలుపెట్టిన వెలిచాల రాజేందర్ రావు మధ్యాహ్నం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్‌లతో కలిసి నామినేషన్ వేశారు. మరోవైపు వెంటనే బయల్దేరి హైదరాబాద్ రావాల్సిందిగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి గాంధీ భవన్ నుంచి పిలుపువచ్చింది. బయల్దేరిన ప్రవీణ్‌రెడ్డికి అధిష్టానం, పార్టీ పెద్దల నుంచి ఎలాంటి హామీ దక్కలేదని తెలిసింది. ఈ విషయం తెలిసి ప్రవీణ్‌రెడ్డి వర్గం అగ్గి మీద గుగ్గిలం అవుతోంది. హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూరు, కరీంనగర్ నియోజకవర్గాల్లో తమ నేత కుటుంబానికి అభిమానులు వేలాదిగా ఉన్నారని, తమను కాదని ఇతరులకు ఎలా టికెట్ ఇస్తారని మండిపడుతున్నారు.

బరిలో అల్గిరెడ్డి

పార్టీ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడం ప్రవీణ్‌రెడ్డిని తీవ్ర ఆవేదనకు గురిచేసింది. పార్టీ పెద్దలు చెప్పిన మాట విని, తాను ఎమ్మెల్యే సీటును త్యాగం చేస్తే, తీరా తనకే ఎంపీ సీటు ఇవ్వకుండా పారాచ్యూట్ లీడర్లకు ఇవ్వడంపై ఆయన వర్గీయులు భగ్గుమంటున్నారు. ఇదే సమయంలో పార్టీపై ఆయన వర్గీయులు మరింత ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. ఇదే సమయంలో అలిగిరెడ్డితో బుధవారం నామినేషన్ వేయించాలని వ్యూహం రూపొందిస్తున్నారు. 25వ తేదీన నామినేషన్ వేయించాలని, ఆ తరువాత అధిష్టానం పెద్దలు చర్చలకు పిలుస్తారని, అప్పుడు బరిలో ఎవరి నిలుస్తారు? ఏ కారణం చేత టికెట్ కన్‌ఫర్మ్ చేస్తున్నారు? ఎవరికి చేస్తున్నారు? తప్పుకున్న వారి భవిష్యత్తు ఏంటి? అన్న విషయాలపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. స్పష్టమైన హామీ రాని పక్షంలో బరిలో రెబెల్‌గా నిలబడాలని ఆయన వర్గీయులు ప్రవీణ్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు.



అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఉపాధి శిక్షణ నిధులు స్వాహా



నకిలీ వేలిముద్ర చూపిస్తున్న సీపీ శ్రీనివాస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న పరికరాలు

- పీఎంకేకే స్కీంకు సంబంధించి రూ.39 లక్షలు కాజేసిన వైనం
- ప్రైవేటు సంస్థ నిర్వాహకుల అరెస్టు

గోదావరిఖని(రామగుండం): ఉపాధి శిక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు రూ.39 లక్షలను నకిలీ వేలిముద్రల సాయంతో స్వాహా చేశారు.. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పాటైన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వాకమిది. కూపీ లాగిన పోలీసులు.. నిర్వాహకులను అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కౌశల్య కేంద్ర్ (పీఎంకేకే) పథకం ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తోంది. భోపాల్ కేంద్రంగా నిర్వహిస్తున్న అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ సంస్థకు దేశంలోని నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చే కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఆ సంస్థ హైదరాబాద్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి, మంచిర్యాల, హుజూర్‌నగర్, జనగామల్లో శిక్షణ కేంద్రాలు కొనసాగిస్తోంది. మంచిర్యాల సెంటర్ నిర్వాహకుడు, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లికార్జున్ 2020 నుంచి ఏడాదికి 320 మంది చొప్పున ప్రతీ సెంటర్‌లో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఒక్కో అభ్యర్థికి కేంద్ర ప్రభుత్వం రూ.13 వేలు మంజూరు చేస్తోంది. ఈ ఏడాది నుంచి ఏటా 720 మందికి శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది. అభ్యర్థుల హాజరు ఆధారంగా నిధులు విడుదల చేస్తోంది.

300 మందికి 50 మందే హాజరు..

మంచిర్యాల సెంటర్‌లో ఈ ఏడాది 300 మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ, 50 మందే హాజరవుతున్నారు. రాబడి తగ్గడంతో సంస్థ ప్రధాన కేంద్రం నిర్వాహకులు సాహిల్ వలీ, హైదరాబాద్ ఆఫీస్ ఇన్‌చార్జి ఆవునూరి శ్రీనివాస్ సూచన మేరకు మంచిర్యాల సెంటర్ ఇన్‌చార్జి మల్లికార్జున్ హాజరు శాతం పెంచేందుకు తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు. నర్సంపేటకు చెందిన విజయ్ సూచనతో అదే ప్రాంతానికి చెందిన సలీంజాఫర్, వెంకటేశ్వర్లు సాయంతో 250 మంది అభ్యర్థుల ఫేక్ ఫింగర్ ప్రింట్స్ రూపొందించాడు. గైర్హాజరైన అభ్యర్థుల అటెండెన్స్‌ను బయోమెట్రిక్ మెషిన్‌లో నమోదు చేసి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇలా ఇప్పటివరకు రూ.39 లక్షలు కాజేసినట్లు సీపీ వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్

దీనిపై సమాచారం అందడంతో రామగుండం సీపీ శ్రీనివాస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులను రంగంలోకి దింపారు. ఆఫీస్ ఇన్‌చార్జి దేవేందర్‌ను విచారించగా స్కాం వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మల్లికార్జున్, నర్సంపేటకు చెందిన షేక్ సలీంజాఫర్, పి.వెంకటేశ్వర్లు, మంచిర్యాలకు చెందిన దేవేందర్‌లను అరెస్టు చేశారు. ఫేక్ ఫింగర్ ప్రింట్స్, తయారీకి వినియోగించిన మెటీరియల్, అభ్యర్థుల అటెండెన్స్ రిజిస్టర్, ల్యాప్‌టాప్, బయోమెట్రిక్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. స్కాంలో సూత్రధారులైన భోపాల్‌కు చెందిన సాహిల్‌వలీ, హైదరాబాద్‌కు చెందిన ఆవునూరి శ్రీనివాస్‌ను అరెస్టు చేయాల్సి ఉంది. రాష్ట్రంలోని మరోరెండు, దేశంలోని మిగతా కేంద్రాలపై కూడా పోలీస్‌శాఖ దృష్టి సారించింది.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరు

- సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి కె.రాజన్న



మాట్లాడుతున్న కె.రాజన్న, వేదికపై ఇ.నరేశ్ తదితరులు

గోదావరిఖని: కేంద్రంలోని బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి కె.రాజన్న కోరారు. లెనిన్ జయంతి, పార్టీ ఆవిర్భావం సందర్భంగా సోమవారం నగరంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించేందుకు దేశంలో విప్లవపార్టీలు ఐక్యంగా ఉండాలన్నారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వం 400 సీట్లు సాధిస్తే రాజ్యాంగాన్నే మారుస్తామంటోందని, ఇలాంటి ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరు చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, చిలుక శంకర్, కె.జ్యోతి, ఎం.దుర్గయ్య, బుచ్చయ్య, కొమురయ్య, రవికుమార్, రాజేశం, మొండయ్య, గుండు రాజన్న, సాంబయ్య, వెంకన్న, పయ్యావుల శ్రీకాంత్, డి.రవీందర్, అర్.రాయమల్లు, నంబయ్య, సదానందం, గొట్టే శంకర్, అరుణోదయ కళాకారులు సీహెచ్ అబేద్నేగో, కాసర్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలను ఓడించాలి

అవినీతి, అవకాశవాద రాజకీయాలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో లెనిల్ జయంతి, కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, నిరుపేదలు ఆకలితో అలమటిస్తుంటే కార్పొరేట్ సంస్థలకు బీజేపీ తొత్తుగా మారిందని ఆరోపించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నంది రామన్న, జూపాక శ్రీనివాస్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, గుమ్మడి వెంకన్న, గూడూరు వైకుంఠం, జాడి దేవరాజ్, శంకరన్న, గొల్లపల్లి చంద్రన్న, మార్త రామన్న, కోడిపుంజుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీలో..

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన లెనిన్ జయంతి సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి నాయకులు బి.అశోక్, రాయమల్లు, పద్మ, పోచం, శంకరమ్మ, మల్లేశ్వరి, చంద్రగిరి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బడికి సెలవు



వార్షిక పరీక్షలు ముగిసి బడికి సెలవులు రావడంతో పిల్లలది అవధుల్లేని ఆనందం అంతాఇంతా కాదు. ఇన్నిరోజులు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు.. పరీక్ష ముగియడంతో ఎగిరి గంతేశారు. ప్రధానంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకున్న విద్యార్థులు.. ఇళ్లకు తీసుకెళ్లేందుకు అమ్మానాన్నలు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం చేశాక.. తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు తల్లిదండ్రులు. రంగంపల్లిలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల వద్ద సోమవారం కనిపించిన చిత్రాలు ఇవి..





– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మావోయిస్టులు పోలీసుల గౌరవవందనం పొందాలి

- రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: మావోయిస్టులు చట్టసభలకు ఎన్నికై పోలీసుల నుంచి గౌరవవందం స్వీకరించాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ కోరారు. సోమవారం రామగుండం పోలీసు కమిషనర్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావుతో కలిసి మావోయిస్టుల ఫొటోలతో ముద్రించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అజ్ఞాతంలోని మావోయిస్టులు పోరాటం చేయాల్సింది అడవిలో కాదని, జనజీవనంలోకి వచ్చి ప్రజాసమస్యలపై చట్టబద్ధంగా పోరాడాలన్నారు. ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని కోరారు. పోస్టర్లపై ముద్రించిన ఫొట్లో ఉన్నవారు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. సమాచారం అందించిన వారికి నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. మావోయిస్టుల గురించి తెలిస్తే.. సీపీ, రామగుండం- 08728 271333, డీసీపీ, పెద్దపల్లి 87126 56502, డీసీపీ, మంచిర్యాల 87126 56503, ఎస్‌బీ 87126 56596 ఫోన్‌నంబర్లకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

విద్యుదాఘాతంతో ఇలు దగ్ధం



మంటల్లో కాలిపోయిన ఇల్లు

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో మ్యాడారం సత్తయ్యకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సత్తయ్య తన కుటుంబంతో కలిసి కొంతకాలంగా కొత్త ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పాత ఇంట్లో మూడు బెడ్లు, ఫర్నీచర్ ఉంది. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం జరిగి ఇల్లు కాలిబూడిదైంది. సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆ ఇద్దరి నేత్రాలు సజీవం



ఆగయ్య (ఫైల్)



రాంబుచ్చమ్మ (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): ఆ ఇద్దరు అనారోగ్యంతో మృతిచెందారు. దుఃఖంలోనూ కుటుంబసభ్యులు వారి నేత్రాలను దానం చేసి, ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనికి చెందిన తాటపల్లి ఆగయ్య(86) అనే సింగరేణి రిటైర్డ్ ఎలక్ట్రీషియన్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన బంధువులు కోలేటి భాస్కర్, కైలాసం నేత్రదానంపై కుటుంబసభ్యులకు అవగాహన కల్పించడంతో ఆగయ్య నేత్రాలను దానం చేసేందుకు ఒప్పుకున్నారు. అలాగే, స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన రాంబుచ్చమ్మ(89) కూడా ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేయాలని స్వచ్ఛంద సంఘాల ముఖ్య సలహాదారు దయానంద్‌గాంధీ బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడటంతో ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరి నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, రఘుపతిగౌడ్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ సహకారంతో సేకరించి, హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించారు. నలుగురికి చూపును వచ్చేలా మృతుల నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన రెండు కుటుంబాలను ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అభినందించారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన బొంగోని చంద్రశేఖర్ అనే గీత కార్మికుడు సోమవారం ప్రమాదవశాత్తు ఈత చెట్టుపైనుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు పెద్దపల్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందున్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత పారిశ్రామిక సంఘం నాయకులు కోరారు.

తల్లిదండ్రులతో గొడవపడి, పారిపోయి..



ఆర్పీఎఫ్ పోలీసుల అదుపులో బాలిక

- రామగుండం చేరిన ఉత్తరప్రదేశ్ బాలిక
- గుర్తించి, కుటుంబసభ్యులకు అప్పగించిన ఆర్పీఎఫ్ సిబ్బంది

రామగుండం: ఇంట్లో గొడవపడిన ఓ బాలిక పారిపోయింది. రామగుండం రైల్వే ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) సిబ్బంది గుర్తించినట్లు సీఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన పన్నెండేళ్ల విజయలక్ష్మి తండ్రి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ఓ వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి స్థానికంగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం కుటుంబసభ్యులతో గొడవపడిన బాలిక ఇంటి నుంచి పారిపోయి, రామగుండం చేరుకుంది. స్థానిక రైల్వే ప్లాట్‌ఫాంపై తిరుగుతుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది అనుమానించారు. ఆమెతో మాట్లాడగా కుటుంబసభ్యులకు తెలియకుండా పారిపోయి వచ్చినట్లు తెలిపింది. దీంతో వారు చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ సతీశ్‌ను పిలిపించారు. తర్వాత బాలిక కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, వారు రాగానే అప్పగించారు. కాగా, బాలికను గుర్తించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ లోకేంద్రకాన్‌ను సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నూతన దంపతులకు గాయాలు

- కుటుంబ సభ్యులకు కూడా..
- కల్వర్టు కిందకు దూసుకెళ్లిన కారు



ప్రమాదానికి గురైన కారు

మానకొండూర్: వివాహ వేడుక పూర్తి చేసుకొని, నూతన వధూవరులు, వారి కుటుంబసభ్యులు కారులో ఇంటికి వెళ్తున్నారు.. దారిలో ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న కల్వర్టు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. పెళ్లికూతురు పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండకు చెందిన రిటైర్డ్ ఎస్సై దామెర సురేందర్ కుమారుడు తిలక్ వివాహం స్వాతితో ఆదివారం వేములవాడలో జరిగింది. సోమవారం సురేందర్, ఆయన భార్య, కౌసల్య, నూతన దంపతులు, పెళ్లి కూతురు చెల్లెలు విద్య కారులో హనుమకొండకు బయలుదేరారు. మార్గమధ్యలో మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద కరీంనగర్-వరంగల్ నేషనల్ హైవే పనుల్లో భాగంగా నూతనంగా కల్వర్టు నిర్మిస్తున్నారు. కారు అక్కడికి చేరుకోగానే అదుపుతప్పి కల్వర్టు కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్నవారికి బలమైన గాయాలయ్యాయి. నవవధువు స్వాతి పరిస్థితి విషమంగా ఉంది. శంకరపట్నం మండల ఈఎంటీ శ్రీధర్, పైలట్ హరికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చర్చించుకున్నారు.

అన్నదాత.. అరిగోస







పెద్దపల్లిరూరల్: పొట్టదశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నారు. పెద్దకల్వల శివారులోని హుస్సేనిమియా వాగు ఒడ్డున ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు వాగులోని తాగునీటి బావి నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు అందిస్తున్నారు. చేతికందే దశలో ఉన్న పంటను ఎలాగైనా దక్కించుకోవాలనే తపనతో వాగులోని మంచినీటిబావి నుంచి తమ పొలం వరకు పైప్‌లైన్ వేసి సాగు నీరందేలా చూసేందుకు అనేక వ్యయ ప్రయాసలకోర్చుతున్నారు.